సాక్షి
అనకాపల్లి

శుక్రవారం ၊ 21 ၊ జూన్ ၊ 2024



చక్రస్నానం 8లో

విశాఖ కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



సినీ ప్రముఖులకు నివాళి

విశాఖ: విశాఖ రత్న అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, కృష్ణ, దాసరి నారాయణరావు, రామోజీరావులకు నివాళులర్పించారు.

గరిష్టం/కనిష్టం
39.9/29.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

కిరండూల్ రైళ్లు గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): వాల్తేర్ డివిజన్ దంతేవాడ–కమలూర్ సెక్షన్ మధ్య జరుగుతున్న రెండో లైన సంబంధిత ప్రి నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కిరండూల్–విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27వ తేదీన కిరండూల్–విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా జగదల్‌పూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

నీట్ అక్రమాలపై న్యాయ విచారణకు డిమాండ్



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గీతాకృష్ణ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పీనారపాలెం నుంచి అబీద్ సెంటర్ వరకు ప్రదర్శన జరిపి నీట్ అక్రమాలపై తక్షణమే విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెడుతూ న్యాయస్థానాలను ఆశ్రయించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం దురదృష్టకరమన్నారు. సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసే వరకు ప్రభుత్వంలో చలనం లేదన్నారు. అభ్యర్థులకు న్యాయం చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న చోట నీట్ పరీక్ష ల అక్రమాలు జరిగాయన్నారు. డివిజన్ నాయకులు గౌతమ్, భూషణ్, మను, మోహన్, దుర్గ పాల్గొన్నారు.


కుటుంబం చెంతకు వృద్ధుడు



కుటుంబ సభ్యుల చెంతన శ్యామ్

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుడు ఎట్టకేలకు కుటుంబం చెంతకు చేరాడు. గుజరాత్‌లో ఉంటున్న తన కుటుంబ సభ్యుల వద్దకు గురువారం చేరుకున్నాడు. కొన్ని రోజుల క్రితం అనకాపల్లి పరిశర ప్రాంతాల్లో మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న వృద్ధుడి సమాచారం తెలుసుకున్న షెల్టర్ మేనేజర్ మమత అతనికి ఆశ్రయం కల్పించారు. అతనికి నగరంలోని మానసిక ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందించటంతో కోలుకున్నాడు. తన పేరు శ్యామ్ అని, గుజరాత్ రాష్ట్రం అని చెప్పటంతో స్థానిక పోలీసుల సాయంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. స్థానిక శ్రద్ధ ఫౌండేషన్ సభ్యుల ద్వారా శ్యామ్‌ను గుజరాత్‌లోని కు టుంబ సభ్యులకు అప్పగించారు. అతని కు టుంబ సభ్యులు షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమ త, ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


మాస్టర్ అథ్లెటిక్స్ విజేతలకు సత్కారం



విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్ (విశాఖ): జాతీయ, అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించి, వారి ప్రతిభను ప్రోత్సహించాలని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ కోరారు. ఇటీవల అయోధ్యలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024లో రాష్ట్రం తరపున పాల్గొని, పతకాలు సాధించిన విశాఖపట్నానికి చెందిన 21మంది క్రీడాకారులను గురువారం సత్కరించారు.

ఆనంద యోగం



సాగరతీరంలో సూర్యనమస్కారాలు

ఆకర్ణ ధనురాసనం

ఆధునిక జీవనంలో అన్నీ ఉన్నా ఏదో ఒక టెన్షన్.. విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు అందరూ ఒత్తిడికి లోనవుతున్నవారే. పేదలకే కాదు ధనికులకూ సమస్యలే. అన్ని సౌఖ్యాలు ఉన్న వారు కూడా కొత్త కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. బయటపడలేక సతమతమవుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. జీవితాన్ని క్రమ పద్ధతిలో పెట్టుకోలేక అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆనాటి యోగులు, రుషుల కాలం నుంచి ఈనాటి నవీన సమాజం వరకు అందరికీ అన్ని వేళలా ఒకటే పరిష్కారం.. అదే యోగా!



చిన్నారుల యోగ విన్యాసాలు



యోగాసనాలు సాధన చేస్తున్న దృశ్యం

- ప్రశాంత జీవనానికి దివ్య ఔషధం
- ఒత్తిడిని, దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసే సాధనం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నక్కపల్లి: ఇంటిలోనూ, ఆఫీసులోనూ.. వృత్తి రీత్యా కొందరు, కుటుంబ సమస్యలతో మరికొందరు, అనారోగ్యాలతో ఇంకొందరు... ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడికి లొంగిపోయి, సమస్యలతో కుంగిపోయి చాలామంది క్షణికావేశంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారు. విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. అటువంటి ఒత్తిడిని అధిగమించి, ప్రశాంత జీవనం గడిపేందుకు సనాతన భారతం ప్రపంచానికి చూపిన దివ్య ఔషధమే యోగా. ఒత్తిళ్లను అధిగమించడమే గాకుండా అనేక దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు, చక్కటి ఆరోగ్యానికి యోగసాధన ఎంతో ఉపకరిస్తుంది. అందుచేతనే ఇటీవల కాలంలో పల్లెల్లో సైతం యోగా శిక్షణకు ఆదరణ పెరుగుతోంది. అనేకమంది మక్కువ కనబరుస్తున్నారు. యోగాసనాల్లో ముఖ్యంగా ఆకర్ణ ధనురాసనం, జాను శీర్షాసనం, పశ్చిమోత్తానాసనం, ధనురాసనం, శలభాసనం, పవన ముక్తాసనం, నటరాజాసనం, వక్రాసనం, భుజంగాసనం, సర్వాసనం, మండూకాసనం ముఖ్యమైనవని చెప్పుకోవచ్చు.

యోగా శిక్షకుల సాయంతో..

రాష్ట్రాన్ని యోగాంధ్రగా చేసేందుకు ఆయుష్ శాఖ రెండేళ్ల కిందటే చర్యలు చేపట్టింది. ఆయుర్వేద ఆస్పత్రులున్న చోట పురుష, మహిళా యోగా శిక్షకులను రెండేళ్ల కిందట ఆయుష్ శాఖ గౌరవ వేతనంపై నియమించింది. వీరు పాఠశాలల్లో పిల్లలకు, గ్రామాల్లో పెద్దలకు యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామంపై శిక్షణ ఇస్తున్నారు. సుగర్, బీపీ సహా తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, నిద్రలేమి, శ్వాసకోశ, జీర్ణకోశ, ఉదర సంబంధిత వ్యాధుల నివారణకు యోగ సాధన ఒక వరంగా మారింది. పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుదల, చక్కని ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపకరిస్తుంది. యోగా కేంద్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని, కేవలం గౌరవ వేతనంపై యోగా శిక్షణ ఇస్తూ ఎంతోమందికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్న యోగా ట్రైనర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఆసనాలతో ఆరోగ్యమస్తు



విశాఖపట్నం : మనిషి అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తిల కలయికే యోగా.. యోగా అనేది వ్యాయామ పద్ధతి కాదు. మనిషి తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే సంపూర్ణ సాధన ప్రక్రియ. ఇది మనసును, శరీరాన్ని, ఆత్మను సమతుల్యంగా ఉంచడం ద్వారా మన జీవన శైలిని మెరుగుపరచడానికి దోహదపడుతుంది. యోగాను రోజువారీ జీవితంలో అమలు చేయడం ద్వారా వ్యక్తిగత ఆధ్యాత్మిక వికాసాన్ని పొందవచ్చు. ప్రపంచ దేశాలు యోగా వైపు చూస్తుండటంతో.. రోజురోజుకు యోగా కేంద్రాలు మారుమూల గ్రామాల్లో సైతం వెలుస్తున్నాయి. మానసిక ప్రశాంతతకు దూరమవుతున్న వారిలో ధైర్యం నింపి భవిష్యత్‌పై భరోసా కల్పిస్తున్నాయి. యోగా ఆరోగ్యంతో పాటు ఎందరికో ఉపాధి సైతం కల్పిస్తోంది. యోగా బోధకులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగా విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రతీ ఆసనం ఉప'యోగ'మే

ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా వివిధ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని యోగా నిపుణులు పేర్కొంటున్నారు. యోగా వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుతారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. క్రమం తప్పకుండా యోగా చేస్తే మానసిక ప్రశాంతతోపాటు శ్వాసక్రియలో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. యోగా చేయడం వల్ల శరీరంలో కొన్ని రకాల హార్మోన్లు విడుదలవుతాయి. ఈ కారణంగానే శరీరం విశ్రాంతి పొందుతుంది. వృద్ధాప్య ఛాయలు దూరమవుతాయి. నిద్రలేమి, కంటి సమస్యలు సహా వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. కొవ్వు నిల్వలు సమతుల్యంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకున్న వారికి యోగా అద్భుత ఔషధమని చెప్పొచ్చు. యోగాతో సామాజిక సంబంధాలు మెరుగుపడతాయి. కాగా.. యోగా ద్వారా ఎంతో మంది ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. యోగా స్టూడియోస్, సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు అందుతున్నాయి. టూరిజం, హాస్పిటాలిటీ రంగాల్లో కొత్త అవకాశాలు వస్తున్నాయి. విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించడానికి, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేయడానికి ప్రముఖ విద్యా సంస్థలు సైతం యోగాన్నే ఆశ్రయిస్తున్నాయి. దీంతో విద్యా వ్యవస్థలో కూడా యోగా బోధకులకు డిమాండ్ ఏర్పడింది.

పాఠశాలల్లో యోగా దినోత్సవం



యోగా దినోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు విజయభాస్కర్

తుమ్మపాల: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయించాలని పాఠశాల విద్యా ప్రాంతీయ సహాయ సంచాలకుడు బి.విజయభాస్కర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పట్టణంలో సెయింట్ జాన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో జిల్లాలో అన్ని విద్యాలయాల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నిత్యజీవితంలో ఒక భాగంగా ప్రతి విద్యార్థి అవలంబించేలా అవగాహన కల్పించాలన్నారు. సూర్యనమస్కారాలతో పాటు పలు యోగాసనాలు వేయించి ఆ ఫొటోలు సమర్పించాలన్నారు. సమాజంలో చదువుపై అందరి దృష్టి పెరిగిందని, దీంతో పాటు విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులతో అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, ఉప విద్యాశాఖ అధికారి వి.అప్పారావు, జిల్లా పరిషత్, ప్రభుత్వ, కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలకు చెందిన 300 మంది హెచ్ఎంలు పాల్గొన్నారు.

వ్యాధులు దూరం



యోగాసనాల ద్వారా అనేక వ్యాధులు దూరమవుతున్నాయి. నేను రెండున్నరేళ్లలో వందలాది మందికి యోగసనాలు, ప్రాణాయామంలో శిక్షణ ఇచ్చారు. ఏళ్ల తరబడి స్వీట్స్ తినడం మానేసిన కొందరు శిక్షణ పొందిన తరువాత స్వీట్లు తిన్నా సుగర్ పెరగడం లేదని చెప్పినప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దలందరూ గుర్తించాల్సిన విషయం ఒక్కటే. ఎవరికి వారికే తమ శరీరం, ఆలోచనలపై నియంత్రణ వుండాలి. అప్పుడు మన శరీరం మన ఆధీనంలో ఉంటుంది. రోజు ఒక గంట యోగసాధన చేస్తే మిగిలిన సమయమంతా శరీరం మన అదుపులో ఉంటుంది. ముఖ్యంగా ఒత్తిళ్ల నుంచి బయటపడే ఏకైక మార్గం యోగ సాధన.

–డి.రాంబాబు, యోగా ట్రైనర్, వేంపాడు, ఆయుర్వేద ఆస్పత్రి

గ్యాస్ట్రిక్ మాత్రలు మానేశాను..



నాకు జీర్ణకోశ సమస్య (గ్యాస్ట్రిక్ ట్రబుల్) ఉండేది. ఇంగ్లీషు మందులు విపరీతంగా వాడినా తగ్గలేదు. యోగా నేర్చుకోవడం ప్రారంభించాను. డైలీ యోగా చేయడం ద్వారా నాలో ఒత్తిడి తగ్గింది. ప్రతిరోజు ఉదయం గంటపాటు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తోంది. ఆరోగ్య సమస్యలు దూరమవుతున్నాయి.

–శ్రీనివాస్, తిమ్మాపురం

ఆసనాలు మాత్రమే యోగా కాదు



చాలామంది ఆసనాలు మాత్రమే యోగా అని అపోహ పడుతుంటారు. వాస్తవానికి ఇందులో నియమాలు పాటించడం, క్రమశిక్షణ, మరో ఆలోచనలు లేని స్థితికి తీసుకుని వెళ్లడం, ఏకాగ్రత ఇవన్నీ యోగాలో భాగం. అందరూ వీటిని ఆచరించాలి.

– కె.గురుమూర్తి, చిట్టివలస

ఎగుమతుల మార్కెట్లో విశాఖ కీలకం

- ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్



జ్యోతి ప్రజ్వలం చేస్తున్న పంకజ్ కూమార్

బీచ్‌రోడ్డు (విశాఖ): ఎగుమతుల మార్కెట్లో విశాఖ ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోందని విశాఖ ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓవర్సీస్ శాఖ ఆధ్వర్యంలోని నగరంలోని ప్రముఖ ఎగుమతిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంకజ్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ అమరావతి సర్కిల్ కుమార్ మోహిత్లు మాట్లాడుతూ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల నిర్వహించే వారికి సైతం ట్రేడ్ రీసివబుల్స్ ఎలక్ట్రానిక్ డిస్కౌంటింగ్ సిస్టమ్ కార్యకలాపాలను ఇటీవల ప్రారంభించామన్నారు. సమావేశంలో క్రెడిట్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్, వివిధ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఐఐ ప్రతినిధులు సంబంధిత పథకాలు, విధానాలపై ప్రదర్శనలు కూడా చేశారు. విశాఖ రీజినల్ మేనేజర్లు సంజీవ్ కుమార్, బాల సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఓవర్సీస్ బ్రాంచ్ చక్రధర్ గారపాటి పాల్గొన్నారు.

ఆగస్టు నుంచి క్యాన్సర్‌పై సర్వే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట (విశాఖ): క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ముందుగా దీనిపై అవగాహన కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్ర మెడికల్ కాలేజీ బోధన ఆస్పత్రి సమావేశ మందిరంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న క్యాన్సర్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ కాంప్రహేన్సివ్ క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆగష్టు ఒకటో తేదీ నుంచి జిల్లాలోని ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్ సర్వే చేస్తారన్నారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని క్యాన్సర్ వ్యాధిని అరికట్టే క్రమంలో నూతన పద్ధతులను అవలంబించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బ్లడ్ డొనేషన్ పేరిట మోసం

- అకౌంట్లలో డబ్బులు వేయించుకొని పరారీ

అల్లిపురం (విశాఖ): ఆస్పత్రిలో ఆపదలో ఉన్న వ్యక్తికి బ్లడ్ ఇస్తామని డబ్బులు అకౌంట్‌లో వేయించుకొని తరువాత పరారైన ఘటన నగరంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సీపట్నానికి చెందిన సిహెచ్.శ్రీను తన తల్లి నూకాలతల్లికి ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం నగరంలోని కేర్ ఆస్పత్రిలో ఈ నెల 11న చేర్పించాడు. డాక్టర్లు ఆమెకు సర్జరీ చేయడానికి ఏబీ పాజిటివ్ బ్లడ్ 5 యూనిట్లు అవసరమని చెప్పారు. దీంతో శ్రీను తనకు తెలిసిన వారికి వాట్సాప్‌లో రిక్వస్ట్ పెట్టుకున్నాడు. దీనిని ఆసరా చేసుకున్న కొందరు శ్రీనుకు ఫోన్ చేసి బ్లడ్ డోనార్స్ ఉన్నారు.. కానీ శ్రీకాకుళం నుంచి రావాలని రూ.2 వేలు అకౌంట్‌లో వేయించుకున్నారు. మరొకరు ఫోన్ చేసి ట్రాన్స్‌పోర్టు చార్జీల నిమిత్తం రూ.1,030 అకౌంట్‌లో వేయించుకున్నారు. ఈ నెల 19వ తేదీన సర్జరీ చేయించేందుకు డాక్టర్లు ఏర్పాట్లు పూర్తి చేసినా బ్లడ్ డోనార్స్ రాకపోవటంతో శ్రీను వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చాయి. అందులో ఒకరు తర్వాత ఫోన్ చేసి తాము బ్లడ్ ఇవ్వం.. డబ్బులు ఇవ్వం ఏమి చేసుకుంటావో చేసుకో అని కట్ చేయటంతో బాధితుడు అయోమయస్థితిలో పడ్డాడు. అప్పటికప్పుడు ఇద్దరు డోనార్ల ద్వారా బ్లడ్ బ్యాంకుల నుంచి బ్లడ్ కలెక్ట్ చేయటంతో సర్జరీ పూర్తయిందని తెలిపారు. ఈ విషయమై సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్ : పంట పొలానికి నీరు తీసుకునే విషయంలో యువకుడిని హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజులు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ బర్కత్ ఆలీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎంద్రపల్లి సంజీవరావు(42) ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు సర్కిల్ పరిధిలోని గిన్నెలు కోట పంచాయతీ పెదబయలు పోలీస్ స్టేషన్ పరిధిలోని లంగుడు గ్రామ నివాసి. మృతుడు లాసంగి గణపతి (27) కూడా లంగుడు గ్రామ నివాసి. వీరికి వ్యవసాయ భూములు ఉన్నాయి. పంట కోతకు వచ్చే సమయంలో ఇద్దరు పొలాలకు నీరు అవసరమైంది. ముందుగా గణపతి తన పొలానికి నీరు చాలా అవసరం అని చెప్పాడు. నిందితుడు అందుకు విరుద్ధంగా గణపతి పొలానికి నీరు ఇవ్వకుండా తన పొలానికి నీరు వాడుకున్నాడు. ఇదే అంశంపై ఇరువురు ఘర్షణ పడ్డారు. సంజీవ్ రావు, గణపతిపై కక్ష పెంచుకున్నాడు. గణపతిని హత్య చేయాలని పథకం వేశాడు. 2016 డిసెంబరు 20వ తేదీన లంగుడు గ్రామంలో ఉదయం 9 గంటల సమయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఇదే అదునుగా సంజీవరావు తన వద్ద నున్న పదునైన సమకత్తితో గణపతి మెడపై నరికాడు. తీవ్ర గాయాలు, రక్తస్రావం మధ్య గణపతి అక్కడికక్కడే మృతి చెందాడు. 17వ తేదీ ఉదయం సంజీవరావు పోలీసులకు లొంగిపోయాడు. అప్పటి పాడేరు సీఐ కె.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేసి నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 302 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు. గణపతి భార్య సూర్యామణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తితే పతనమే..



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి (విశాఖ): కార్పొరేట్ శక్తుల అడుగులకు మడుగులొత్తితే ఏ దేశమైనా, రాష్ట్రమైనా, సంస్థ అయినా పతనం అంచుల్లోకి వెళ్లక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నేతృత్వంలో 1225వ రోజు కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి, ప్రజల ఆస్తులను బడాబాబులకు దోచిపెట్టడం మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే పాలకులు కాలగర్భంలో కలిసిపోక తప్పదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థను నాశనం చేయాలనుకోవడం ఒక జాతిని నాశనం చేసుకోవడంతో సమానమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం దిగివచ్చి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, అయోధ్య రామ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోదకొండమ్మ పండగలో అందని ఆర్టీసీ సేవలు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండగకు ఆర్‌టీసీ బస్సులు నడపడంలో సంస్థ విఫలమైందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిగే మోదకొండమ్మ పండగకు వేలాది మంది భక్తులు దూర ప్రాంతాలు నుంచి తరలి వస్తుంటారు. అలాగే ఈ ఏడాది కూడా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అయితే ఆర్‌టీసీ బస్సులు సకాలంలో సక్రమంగా తిరగక, భక్తులు ఆటోలు, ఇతర వాహనాల్లో రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన పండగకు ఆర్‌టీసీ యాజమాన్యం తగిన బస్సు సౌకర్యం కల్పించ లేకపోయిందని, వాపోయారు. ఇకపై మోదకొండమ్మ, పండగ తీర్థాలు సమయాల్లో తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, ఆర్‌టీసీ యాజమాన్యాన్ని కోరారు.

నేటి నుంచి లలితాపీఠంలో ఆరాధనోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కుర్తాళం శంకరాచార్యులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట (విశాఖ): అక్కయ్యపాలెం లలితాపీఠంలో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు గురువుల ఆరాధనోత్సవాలు, ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాలను కుర్తాళం శంకరాచార్యులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఈనెల 21, 22, 23 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిచే త్రిశక్తి వైభవం ఉపన్యాసాలు జరుగుతాయని తెలిపారు. 24వ తేదీ సాయంత్రం శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామిచే జగద్గురు శంకర విజయంపై అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. 25వ తేదీన శ్రీలలితా సహస్రనామ పారాయణ, సువాసినీపూజ జరుగుతుందన్నారు. 26వ తేదీ సాయంత్రం మీగడ రామలింగస్వామి బృందంచే భక్త నత్కీర నాటక ప్రదర్శన, 27వ తేదీన డాక్టర్ డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో కవితాగోష్ఠి, 28వ తేదీన అక్కిరాజు సుందర రామకృష్ణ నిర్వహణలో భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 26వ తేదీ ఉదయం దక్షిణామూర్తి ఆరాధన, 28 తేదీన ఉదయం అవ్యక్తానంద మహరాజ్ ఆరాధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు.

సుప్రీం షిప్‌యార్డ్

- 83 ఏళ్లు పూర్తి చేసుకున్న హిందుస్తాన్ షిప్‌యార్డ్
- వైఎస్సార్ చొరవతో మూత దశ నుంచి లాభాల బాట
- రూ.1,438 కోట్ల ఆదాయంతో దూసుకుపోతున్న హెచ్‌ఎస్‌ఎల్
- ప్రస్తుతం రూ.20 వేల కోట్ల టర్నోవర్
- దేశ భద్రత కోసం 5 ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు సిద్ధం చేస్తున్న హెచ్‌ఎస్‌ఎల్
- అత్యాధునిక ఎలక్ట్రానిక్ టెస్టింగ్ ల్యాబ్, టెస్ట్ బెడ్ సౌకర్యం
- 80 టన్నుల క్రేన్ వంటి కొత్త సౌకర్యాలు నేటి నుంచి అందుబాటులోకి..

ఇండస్ట్రీ విభాగంలో దూసుకెళ్లేలా.. సాంకేతిక సంస్కరణలు చేసుకుంటూ.. రూ.20 వేల కోట్ల పనులను సొంతం చేసుకొని.. దేశంలోనే సుప్రీం షిప్‌యార్డుగా హిందుస్థాన్ షిప్‌యార్డు అడుగులు వేస్తోంది. దేశీయ నౌకల తయారీపై దృష్టి సారిస్తూ అత్యుత్తమ సేవలందిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. షిప్‌యార్డు చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.20 వేల కోట్ల టర్నోవర్ సొంతం చేసుకొని.. ఆత్మనిర్భర్ భారత్‌తో నౌకా నిర్మాణం, మరమ్మతుల విషయంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని హెచ్‌ఎస్‌ఎల్ నిలబెట్టుకుంటోంది. దివంగత వైఎస్సార్ చొరవతో మూత దశ నుంచి లాభాల బాట పడుతూ నేటితో 83 ఏళ్లు పూర్తి చేసుకొని 84వ వ్యవస్థాపక దినోత్సవాన్ని చేసుకుంటోంది.





సాక్షి, విశాఖపట్నం : ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తూ ఆయా సంస్థలకు అప్పగిస్తున్న హెచ్‌ఎస్‌ఎల్.. ఇప్పుడు దేశంలోనే ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకూ 200 నౌకలు తయారు చేసిన షిప్‌యార్డు తాజాగా 2000 షిప్స్ మరమ్మతుల పనులను కూడా పూర్తి చేసింది. ఈ ఏడాది ఏకంగా రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన కాంట్రాక్టును కూడా దక్కించుకుంది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి సన్నద్ధమవుతోంది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్(ఎఫ్‌ఎస్‌ఎస్)ని భారత నౌకాదళం, కోస్టుగార్డు కోసం తయారు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. హై వాల్యూస్‌తో ఈ నౌకల నిర్మాణాలు చేపట్టనుంది. 45 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యమున్న నౌకల్ని తయారుచేసే ప్రక్రియ ప్రారంభించింది. ఈ నౌకల నిర్మాణాలతో హెచ్‌ఎస్‌ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరిగింది. ఇదే ఊపుతో స్వదేశీ పరిజ్ఞానాన్ని దేశీయ పరిశ్రమల్ని మరింతగా ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్న షిప్‌యార్డు.. శుక్రవారం 84వ వ్యవస్థాపక దిన సంబరాలు చేసుకుంటోంది.

వైఎస్సార్ చొరవతో లాభాల బాటలో..

సరైన ఆర్డర్లు రాక నష్టాల బాటపడుతూ కష్టాల సంద్రంలో కొట్టుమిట్టాడుతున్న హిందుస్థాన్ షిప్‌యార్డు దుస్థితిని చూసి చలించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. షిప్‌యార్డుని నౌకాదళంలో విలీనం చేయించడంలో ముఖ్య భూమిక పోషించారు. తొలినాళ్లలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నా క్రమంగా పుంజుకుంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.595 కోట్ల విలువైన పనులు పూర్తిచేసిన షిప్‌యార్డు.. అత్యధిక టర్నోవర్‌గా ఇప్పటివరకూ రికార్డు ఉండేది. ఆ రికార్డును తిరగరాస్తూ షిప్‌యార్డు తొలిసారిగా రూ.759 కోట్ల టర్నోవర్‌ను 2021–22 ఆర్థిక సంవత్సరంలో సాధించింది. ఇందులో రూ.51 కోట్ల వరకూ నికర లాభాల్ని ఆర్జించిన హెచ్‌ఎస్‌ఎల్ మొత్తం 60 శాతం వృద్ధి సాధించింది. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. 2023–24లో రూ.1593 కోట్ల ఆదాయాన్ని, రూ.109 కోట్ల నికర లాభాన్ని ఆర్జించి రికార్డు సృష్టించింది.

రక్షణ, వాణిజ్య రంగాల్లో కీలకంగా హెచ్‌ఎస్‌ఎల్

దేశ రక్షణ, వాణిజ్య రంగాల్లో విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ కీలకంగా మారుతోంది. ఏకంగా రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన కాంట్రాక్టుపై సంతకం చేసింది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి సన్నద్ధమవుతోంది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్(ఎఫ్‌ఎస్‌ఎస్)ని భారత నౌకాదళం, కోస్టుగార్డు కోసం తయారు చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా 45 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యమున్న నౌకలను తయారు చేయనుంది. ఈ నౌకల నిర్మాణాలతో హెచ్‌ఎస్‌ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరగనుంది. తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్(ఎఫ్‌ఎస్‌ఎస్) నిర్మాణానికి అవసరమైన 44 వేల టన్నుల స్టీల్ కటింగ్ ప్రక్రియ కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారు. విశాఖపట్నం పరిసరాల్లో ఉన్న 550 ఎంఎస్‌ఎంఈల సహకారంతో నౌకా నిర్మాణంలో కీలకంగా అడుగులు వేస్తోంది. ఎంఎస్‌ఎంఈల ద్వారా 3 వేల మందికి పైగా స్థానికులకు హెచ్‌ఎస్‌ఎల్ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

ఆధునికీకరణతో కొత్త పుంతలు



షిప్‌బిల్డింగ్‌లోనూ, వాణిజ్య రంగాల నుంచి వచ్చే ఆర్డర్లతో రాబోయే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేలా నిలదొక్కుకొని ప్రపంచంలోనే నౌకానిర్మాణంలో అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాం. ఈ దిశగా చేపడుతున్న పనుల కారణంగా ఇటీవల కాలంలో ఏకంగా 21 జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నాం. 84వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా షిప్‌యార్డు ఆధునికీకరణ పనుల్ని ప్రారంభిస్తున్నాం. అత్యాధునిక ఎలక్ట్రానిక్ టెస్టింగ్ ల్యాబ్‌తో పాటు టెస్ట్ బెడ్ సౌకర్యాల్ని ప్రారంభిస్తున్నాం. అదేవిధంగా 80 టన్నుల హెవీ క్రేన్ అప్‌గ్రేడెడ్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఉద్యోగుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో క్వార్టర్స్‌ని ప్రారంభిస్తున్నాం. స్టేక్ హోల్డర్స్‌కు మరింత చేరువయ్యేలా సరికొత్త వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ని ఆవిష్కరిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌కు హెచ్‌ఎస్‌ఎల్ కేంద్ర బిందువుగా మారుతోంది. రూ.1000 కోట్లతో యార్డును రానున్న మూడేళ్లలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. భవిష్యత్తులో హెచ్‌ఎస్‌ఎల్‌లో జరిగే పనుల్లో సింహభాగం స్వదేశీ పరిజ్ఞానంపైనే ఆధారపడాలనేది మా ముందున్న ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

– కమొడర్ హేమంత్ ఖత్రి, హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం

దాబాగార్డెన్స్ (విశాఖ): కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవబృథోత్సవం, చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి తెప్పోత్సవ(ప్లవోత్సవం) కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోర్టు సహాయ సహకారాలతో శ్రీదేవి భూదేవి సమేతుడైన స్వామికి మేళ తాళాలతో పైలట్ లాంచీలో అతి వైభవంగా తెప్పోత్సవం జరిపించనున్నారు.

నీట్ పరీక్షపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

తగరపువలస (విశాఖ) : నీట్ యూజీసీ – 2024 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి దర్యాప్తునకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న కోరారు. ఈ మేరకు ఆమెకు హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఈ ఏడాది మే 5న నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల నుంచి తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపి పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే నీట్ పరీక్షలో అక్రమాలపై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు కోసం రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సులు నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ నందు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరే అభ్యర్థుల వయసు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలని, ఇంటర్/పదో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. మూడు నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ, ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ తదితర సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ పాసైన యువతీ యువకులు బీఎస్సీ/డిప్లొమా పారామెడికల్ కోర్సులకు కూడా అర్హులన్నారు. పూర్తి వివరాలకు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ లేదా ద్వారకానగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. 72079 53290, 79930 11605 నంబర్లలో ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

- చోడవరం కేంద్రంగా ప్రజా పోరాటాలకు రూపకల్పన
- ఈ నెల 22, 23న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న వెల్లడి



సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి : ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటాలు సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న స్పష్టం చేశారు. ఇకపై చోడవరం కేంద్రంగా ప్రజా పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ మేరకు దేవరాపల్లిలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 22,23 తేదీలలో సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను రెండు రోజులు పాటు చోడవరంలోని శ్రీకాంత్ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని, సీపీఎం నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వెనుకబడిన చోడవరం, మాడుగుల నియోజకవర్గంపై నూతనంగా కొలువు దీరిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో అధికంగా గిరిజనులు ఉన్న గ్రామాలను ఐదో షెడ్యూల్ చేర్చకపోవడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి చెరకు పంటను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీని మంజూరు, రైతులకు కోల్డ్ స్టోరేజీ, రైవాడ నీటిని రైతులకు రెండు పంటలకు ఇవ్వాలని సీపీఎం నేత వెంకన్న డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి స్టాంపులు, నాణేల ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న గుప్తా

దాబాగార్డెన్స్: నుమిస్మాటిక్ అండ్ ఫిలాటిక్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో ప్రాచీన నాణేలు, స్టాంపులు, నోట్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ విశాఖ శాఖ ప్రెసిడెంట్ సీహెచ్‌వీఆర్ గుప్తా, కార్యదర్శి కె.కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 21న సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు, 22న ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు, 23న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి సుమారు 30 మంది సభ్యులు ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విష్ణుపెక్స్–2024 పేరిట ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనను పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ డీఎస్ఎస్‌వీ వర్మ, నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ ప్రారంభిస్తారన్నారు. 65 ఏళ్ల లయన్స్‌క్లబ్ ఆఫ్ విశాఖపట్నం పేరిట ప్రత్యేక స్టాంపు విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో ప్రాచీన కాలం నాటి బంగారు, వెండి నాణేలు, ఇతరదేశాల్లో తయారు చేసిన బంగారు కరెన్సీ నోట్లు, స్టాంపులు, ఆర్‌బీఐ విడుదల చేసిన రూ.10 నుంచి 1000 వరకు నాణేలు, వెండి నాణేలు, 120 దేశాల్లో చలామణి అయిన నోట్లతో పాటు భారతీయ తపాలా శాఖ ప్రత్యేకంగా వెండితో తయారు చేసి బంగారు పూత పూసిన ప్రత్యేక తపాలా బిళ్లలతో పాటు మరెన్నో నాణేలు, స్టాంపులు, నోట్లు ఉంటాయని పేర్కొన్నారు.

తాటిచెట్టును ఢీకొట్టిన ఆటో



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

మాకవరపాలెం : ఆటో టైరు పేలడంతో జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కొంకోట మండలం పాతకన్నూరు పాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పైడియ్య గురువారం మాకవరపాలెం నుంచి స్వగ్రామం వెళ్తుండగా మండలంలోని భీమబోయినపాలెం సమీపానికి వెళ్లేసరికి ఆటో టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఆటో రోడ్డు పక్కనే ఉన్న తాటిచెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పైడియ్యకు చేయి, కాలు విరిగిపోగా అతడి భార్య లక్ష్మికి తలపై గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న మరో ఇద్దరు మహిళలు రాజేశ్వరి, సరోజినికి కూడా గాయాలవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం వీరిని 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల కేసు

నర్సీపట్నం : విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రైవేటు ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశామని టౌన్ సీఐ కాంతి కుమార్ తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలెం మండలం, తూటిపాల గ్రామానికి చెందిన వివాహిత మహిళ వెటర్నరీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతుంది. తరగతి గదిలో ప్రిన్సిపాల్ చౌరీ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

లాడ్జిపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఆరిలోవ (విశాఖ): పెదగదిలిలో ఓ లాడ్జిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించి.. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు యువతులు, ఐదుగురు యువకులు ఉన్నారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెదగదిలి కూడలి వద్ద ఉన్న లాడ్జికి నిత్యం బయట ప్రాంతాల నుంచి యువతీయువకులు వచ్చి రోజుల తరబడి గడుపుతున్నారు. వీరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్, ఆరిలోవ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. లాడ్జి యజమానిపై కేసు నమోదు చేశారు. ఆరిలోవలో హెల్త్‌సిటీ ఉండడంతో రోగుల బంధువులకు లాడ్జిలు అవసరమవుతాయి. దీంతో కొందరు పెదగదిలి, చినగదిలి, ఆదర్శనగర్‌లో లాడ్జిలు నిర్వహిస్తున్నారు. వీటిలో రోగుల బంధువులు కంటే బయట నుంచి వస్తున్న యువతీ యువకులే ఎక్కువగా గడుపుతున్నారని స్థానికులు అంటున్నారు. ఈ లాడ్జీలన్నీ నివాసాల మధ్యలో ఉండడంతో.. వాటిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల ప్రభావం స్థానిక యువతపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిత్యం వీటిపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

వ్యాక్సినేషన్‌కు ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

బీచ్‌రోడ్డు (విశాఖ): వివిధ రకాల వ్యాక్సినేషన్ కోసం నగరంలో ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఫైజర్ ఇండియా డైరెక్టర్ సంతోష్ తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వివరాలను గురువారం ఆయన మీడియాకు వివరించారు. కిమ్స్ ఆస్పత్రి భాగస్వామ్యంతో ఆస్పత్రి ప్రాంగణంలో ఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలతో దివ్యాంగ బాలల్లో మానసిక ఉల్లాసం

- జిల్లాలోని 11 భవిత కేంద్రాల్లో మొక్కల పెంపకం
- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

పెదగంట్యాడ: దివ్యాంగ బాలల మానసిక ఉల్లాసానికి ఉద్యానవనాలు ఎంతగానో దోహదం చేస్తాయని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. భవిత కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ గీత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అక్షిత ఇంగ్లిష్ మీడియం పాఠశాల యాజమాన్యం బహూకరించిన ట్రెడ్ మిల్, స్టిమ్యులేటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏడీసీ మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లాలోని 11 భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల గల పిల్లల్లో మానసిక ఉల్లాసం కలిగించేందుకు రంగురంగుల పూల మొక్కలను, ఔషధ గుణాలు ఉన్న మొక్కలను నాటనున్నామని తెలిపారు. ఈ మొక్కలను విశాఖ గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో సంస్థ అధ్యక్షుడు రత్నం తమ నర్సరీ నుంచి అందించనున్నారని చెప్పారు. ఎకో వైజాగ్‌లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉన్నాయన్నారు.

సుందర వనంగా విశాఖ

విశాఖ నగరాన్ని సుందర వనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కోరారు. దీనికి జీవీఎంసీ నుంచి సహకారం ఉంటుందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఏపీసీ బి.శ్రీనివాసరావు, గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, పెదగంట్యాడ తహసీల్దార్ భాస్కరరావు, ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ, ఏపీవో అప్పలనాయుడు, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

43 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి రవాణా చేస్తున్న మహారాష్ట్ర వాసిని అదుపులోకి తీసుకున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి రవాణా చేస్తున్న ఒకరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన అయూబ్ యూసఫ్ షేక్ అనే వ్యక్తి బ్యాగులో రూ.2,15,500 విలువ గల 43.1 కిలోల గంజాయి ఉండటం గుర్తించారు. ఈ గంజాయిని స్వాధీనం చేసుకుని.. అతన్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు. ఈ గంజాయిని విశాఖపట్నం మీదుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

పాత నిందితుడి అరెస్ట్

గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన మెండ నారాయణరావు(పాత కేసులో ఎ–2 నిందితుడు) పట్టుబడ్డాడు. అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు తెలిపారు.

3 కిలోలు.. ముగ్గురు అరెస్ట్

మద్రిపాలెం: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. కంచరపాలెం బర్మా క్యాంపునకు చెందిన వై.రమేష్, ఎం.అనిల్‌కుమార్, డి.కిశోర్ బుధవారం రాత్రి కైలాసపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ దివ్యభారతి దాడి చేసి.. వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు 10వ యోగా దినోత్సవం

అనకాపల్లి: స్థానిక గవరపాలెంలోని పార్కు సెంటర్ భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యురాలు కె.లావణ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అందరూ ఆహ్వానితులేనని, వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాల్సిందిగా కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీలోని 33/11 కేవీ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్తూరు విద్యుత్ శాఖ పరిధి వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, వినన్నపేట, రామన్నపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ ఉద్యోగులకు సహకరించాల్సిందిగా కోరారు.

తారక్‌నాథ్‌కు ఘన నివాళి



చిన్నారులకు సాయం అందిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు తారక్‌నాథ్ వర్ధంతి కార్యక్రమం గురువారం సబ్బవరం ఎస్‌బీఐ బ్రాంచి వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి సబ్బవరం ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం సభ్యులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మండలంలోని పెదగొల్లలపాలెం దళితవాడలో తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మిగిలిన ఇద్దరు బాలురకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని వారి పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్టు సంఘం రీజనల్ సెక్రటరీ పైలా ప్రసాదరావు తెలిపారు. ఇంకెవరైనా దాతలు ముందుకు వచ్చి సాయం అందిస్తే బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మురళీ, కల్యాణ్, రమేష్, నిహార్, శ్రీరాములు, జి.వి.రమేష్, లక్ష్మి, పెంటయ్య, కమలాకర్, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 322 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,500
రెండో రకం	3,900	4,500
మూడో రకం	3,000	3,940

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
ఓఎంజీ(ఓ మంచి ఘోస్ట్)	: వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 352 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 306 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

యోగా, ధ్యానం, ప్రాణాయామం.. ఆరోగ్యం

- నేడు ప్రపంచ యోగా దినోత్సవం
- పట్టణం, మండల ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- కరోనా తర్వాత ప్రజల్లో యోగాపై పెరిగిన ఆదరణ

ఏ వయసువారైనా ఉదయాన్నే కాసేపు యోగా చేస్తే రోజంతా చురుగ్గా ఉంటారు. ఒత్తిడి దరి చేరదు. అనారోగ్య సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. ధ్యానం, ప్రాణాయామం, యోగా చేసే వారిలో సానుకూల ధోరణి ఎక్కువ. ఆసనాలు, ధ్యానం చేసేటపుడు వేగంగా, అధికంగా గాలి తీసుకోవడం ద్వారా ఆక్సిజన్ ఎక్కువగా మెదడుకు చేరి, శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. భారత ప్రభుత్వం పిలుపు మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం(జూన్ 21)లో భాగంగా నియోజకవర్గ పరిధిలో పలు చోట్ల శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ప్రత్యేక యోగాసనాల్లో చిన్నారులు



యోగాభ్యసనలో భాగంగా సూర్య నమస్కారాలు

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా యోగా ప్రత్యేక ఆదరణ పొందుతోంది. మారుతున్న కాలంలో, ఉరుకుల పరుగుల జీవనంలో ఒత్తిడి తట్టుకునేందుకు ప్రధాన మార్గం యోగా. అందుకే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు చోట్ల ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యక్తుల ఆధ్వర్యంలో యోగా శిక్షణ కేంద్రాలు వెలిశాయి. ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలకంగా మారారు. ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా యోగాపై అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నారు.

నియోజకవర్గంలో యోగా శిక్షణ

- పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని ఆయుష్మాన్ భారత్ ఆస్పత్రిలో ఉదయం, సాయంత్రం రోగులకు యోగాలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఇద్దరు ట్రైనర్లను నియమించింది.
- పట్టణ పరిధిలో జార్జిక్లబ్, రింగ్‌రోడ్డు, చిన్నరాజుపేట, గవరపాలెం పార్కుసెంటర్, నూకాంబిక అమ్మవారి రహదారి, నెయ్యిలవీధి, గాంధీనగరం, మల్లిమఱుగులవారి వీధి తదితర చోట్ల యోగా శిక్షణ జరుగుతోంది.
- మండలంలోని తుమ్మపాల, గుండాల జంక్షన్ రహదారి, మామిడిపాలెం, కొత్తూరు తదితర ప్రాంతాల్లోని యోగా సెంటర్లలో పిల్లల నుంచి వృద్ధుల వరకూ నిత్యం యోగా, ధ్యానం, ప్రాణాయామంలో శిక్షణ పొందుతున్నారు.
- కొన్ని కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేకంగా మహిళా ట్రైనర్లతో యోగా శిక్షణ నిర్వహిస్తున్నారు.



ప్రత్యేక యోగాసనాలు, విన్యాసాలు చేస్తున్న చిన్నారులు

యోగాతో ఆరోగ్యకర జీవనం



వయస్సును బట్టి శరీరంలో అనేక రకాల వ్యాధుల బారిన పడే అవకాశాలెక్కువ. నిత్యం యోగా చేయడమే కాకుండా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. ప్రతి వ్యక్తికి కరోనా తర్వాత యోగాపై ఆసక్తి పెరిగింది. యోగాతో రక్తప్రసరణ వ్యవస్థ మెరుగవుతుంది. క్లబ్ ఆవరణలో యోగా కేంద్రాన్ని ఏర్పాటు సుమారు ఏడాది కావస్తోంది. జార్జిక్లబ్ ఆవరణలో రోజూ ఉదయం సమయంలో వివిధ వర్గాలకు చెందిన 101 మందికి యోగాపై శిక్షణ ఇస్తున్నాం.

– భీశెట్టి దొరమ్మనాయుడు, యోగా గురువు, జార్జిక్లబ్, అనకాపల్లి

ఆస్పత్రిలో రోగులకు యోగా శిక్షణ



యోగా.. ఆత్మ పరమాత్మల కలయిక. చిత్తవృత్తి నిరోధం యోగా. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయుష్మాన్ భారత్ ఆస్పత్రికి వచ్చే రోగులకు యోగాలో శిక్షణ ఇస్తున్నాం. గతంలో 6గురు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం 25 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది. చిన్న తనం నుంచి యోగాసనాలు వేసే వారు వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువ.

– బి.అప్పారావు, యోగా ట్రైనర్, అనకాపల్లి

మూడుసార్లు ఫస్ట్ ప్లేస్



చిన్న తనం నుంచి యోగాపై ఆసక్తి ఎక్కువ. కశింకోటలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నా. తోటి విద్యార్థులు యోగా చేయడం చూసి, నాకూ ఆసక్తి కలిగింది. 8, 9 తరగతుల్లో మూడుసార్లు జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించాను. రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాను. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నా. జాతీయ స్థాయిలో గెలుపొందేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా.

– శీరం ఆదిత్యవర్ధన్, విద్యార్థి, కొత్తపల్లి బుచ్చియ్యపేట, కశింకోట

ధారెత్తిస్తున్న టమాటా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కిలో రూ.100కు చేరువ అవుతోంది. గత వారం కిలో రూ.70 ఉండగా ఈ వారం రూ.80కి పెరిగింది. బీరకాయ కూడా దీనితో పోటీ పడింది. ఇది కూడా రూ.80కి విక్రయాలు సాగాయి. బెండకాయ రూ.40 నుంచి రూ.60కి పెరిగింది. ఇక మిగిలిన కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. బంగాళాదుంప, వంకాయ రూ.40, ఉల్లిపాయ రూ.50, బీట్రూట్, క్యారెట్, దొండకాయ రూ.60కి విక్రయాలు సాగాయి. రూ.20 ఉండే కొత్తిమీర కట్ట రూ.70కి చేరింది. ఎండలతోపాటు కూరగాయల ధరలు కూడా మండిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండల వల్ల కూరగాయల ఉత్పత్తి తగ్గి, ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు.

15వ తేదీలోగా ఇంటర్ పాఠ్య పుస్తకాల పంపిణీ

పరవాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలతో పాటు 200 పేజీల 12 నోట్ పుస్తకాలు, బ్యాగును అందజేస్తామన్నారు. కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

వీధి లైట్లు లేక చీకట్లు

పరవాడ : నాయుడుపాలెం శివారు గంగునాయుడు పాలెం గ్రామం సమస్యల వలయంలో చిక్కుకుందని ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ వీధి లైట్లు పునరుద్ధరించలేదన్నారు. ఫలితంగా చీకటి పడితే ఇంటి నుంచి బయటకు రావాలంటే స్థానికులు భయపడుతున్నారన్నారు. గ్రామంలోని అంధకారం తొలగించేందుకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులకు రాయితీ వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో రంగాచారి, గ్రామపెద్దలు

తుమ్మపాల: రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పీయూబీ రంగాచారి అన్నారు. మండలంలోని తుమ్మపాల ఆర్బీకేలో గ్రామ పెద్దలతో కలిసి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు అవసరమైన ప్రతి రైతుకు విత్తనాలు అందిస్తామన్నారు. రైతులు తమకు కావాల్సిన విత్తనాల కొరకు తమ వివరాలను ముందుగానే ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలన్నారు. సబ్సిడీపై ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగ పరచుకోవాలన్నారు. ప్రతి ఆర్బీకేలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ షాపుల్లో కొనుగోలు చేసే విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్తీ విత్తనాలను గుర్తించినట్‌లెతై తక్షణమే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, మాజీ సర్పంచ్ కర్రి బాబీ, ఎంపీటీసీలు చదరం నాగేశ్వరరావు పంచదార్ల కన్నారావు, బొడ్డపాటి రామ్‌కుమార్, రైతు నాయకులు రాపేటి రామ్‌కుమార్, పీలా విశ్వేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి పోకండి

- మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన చర్యలు
- సెబ్ సీఐ పి.ఉమామహేశ్వరరావు
- కళాశాల విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సెబ్ అధికారులు

యలమంచిలి : డ్రగ్స్ మహమ్మారి జోలికి విద్యార్థులు పోరాదని యలమంచిలి సెబ్ సీఐ పి.ఉమామహేశ్వరావు కోరారు. డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల సూచనలు మేరకు ఆయన గురువారం తన సిబ్బందితో కలసి యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రస్తుత సమాజంలో యువతీ యువకుల్లో డ్రగ్స్ తీసుకోవడం ఎక్కువైందని డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మానసికంగా శక్తి నశించి వారిలో నేరపూరితమైన ప్రవర్తనలకు విద్వేష పూరితమైన ఘటనలకు లోనై హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. డ్రగ్స్ తీసుకునే వారిపై , మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి వంటి కేసుల్లో యువత ఒక్కసారి పట్టుబడితే జైలు కెళ్లడంతో పాటు జీవితం అంతా అంధకారమవుతుందన్నారు. సమాజంలో విద్యార్థులు తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకురాకుండా ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలించినట్టు తెలిస్తే తమకు సమాచారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ శ్రావణ్, సెబ్ పోలీసులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీడ్ డ్రిల్ పద్ధతిలో వరి విత్తుకోండి

యలమంచిలి : వరి విత్తులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీధర్ అన్నారు. ఆయన యలమంచిలి మండలం రామారాయుడు పాలెం గ్రామంలో రైతులకు వరి విత్తే పద్ధతులపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో కలసి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తనాలు ఏవిధంగా నాటాలో రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఎకరా పొలానికి 20 కేజీల విత్తనం అవసరం అవుతుందని, విత్తనంతో పాటు ఎరువు కూడా ఒకేసారి వేయవచ్చునని ఈ విధంగా చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తక్కువగా అవుతుందని ఖరీఫ్ సీజన్‌లో యాజమాన్య పద్ధతులు పాటించి వరి పంటను ఏవిధంగా వేసుకోవాలి వంటి అంశాలపై ప్రణాళికా కార్యచరణపై రైతులకు వివరించారు. ముందస్తుగా కలుపు నివారణ మందులు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకొని పంటలు వేసుకుంటే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి మోహనరావు , వ్యవసాయ శిక్షణ కేంద్రం శాస్త్రవేత్త విజేత, హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రసాదరావు, బండి నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో సూర్యనారాయణమూర్తి

సబ్బవరం: మండలంలో తవ్వవానిపాలెం జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను సబ్బవరం ఎంఈవో బి.సూర్యనారాయణమూర్తి గురువారం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి

సబ్బవరం: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సబ్బవరం ఎంఈవోలు ఎస్.లక్ష్మణ్, బి.సూర్యనారాయణమూర్తి కోరారు. సబ్బవరం ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బడి ఈడు పిల్లలు బడిలో మాత్రమే ఉండాలన్నారు. బడి బయట ఉంటే వెంటనే బడిలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. వచ్చే నెల 12వ తేదీ వరకు నిర్వహించే నేను బడికి పోతా కార్యక్రమంలో బడి బయట ఉన్న పిల్లలు, డ్రాప్ అవుట్లను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.లలితకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చోడపల్లి వద్ద వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం : మండలంలోని చోడపల్లి వద్ద హెవీ లోడ్‌తో వెళుతున్న వాహనాలను సీఐ బుచ్చిరాజు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆయా వాహనదారులకు నిబంధనల గురించి వివరించారు. పరిమితికి మించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని పలు కూడళ్లలో ఆక్రమణలు గురువారం తొలగించారు. అచ్యుతాపురం సుందరీకరణలో భాగంగా అధికారులు సమన్వయంతో రహదారి ఆక్రమణలు తొలగించే పనిని చేపట్టారు. సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా డ్రైనేజీని సైతం గాడిలో పెట్టి సెజ్ ప్రాంత హెడ్‌క్వార్టర్‌ను అందంగా తీర్చి దిద్దే పనిలో పడ్డారు. దీనికి అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



దుర్గమాంబను దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, పెద్దలు

పరవాడ: గ్రామంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులకు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు చీర, జాకెట్, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, స్థానిక నాయకులు పైల పోతినాయుడు, పైల గోపాలకృష్ణ, పైల హరీష్, వర్రి హరి తదితరులు దర్శించుకున్నారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, కోయ డ్యాన్స్‌ల నడుమ అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల నడుమ భారీ సంఖ్యలో భక్తులు వెంట నడవగా దుర్గమాంబ అనుపు మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భానుడి భగభగలు



నిత్యం రద్దీగా ఉండే నెహ్రూచౌక్ మెయిన్‌రోడ్డు నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం, (ఇన్‌సెట్) కశింకోటలో ఎండ తీవ్రతతో బోసిపోయిన వారపు సంత

- పట్టణంలో 40.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత

అనకాపల్లి: గత మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలకు పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ పగటిపూట నిర్మానుష్యంగా మారుతున్నాయి. గురువారం అనకాపల్లి పట్టణంలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీనికి తోడు తీవ్ర వడగాడ్పులతో ఉక్కబోత వాతావరణం నెలకొంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి జనాలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. పిల్లలు, వృద్ధుల ఇబ్బందులు వర్ణనాతీతం. మూడు రోజులుగా ఇవే పరిస్థితులుండటంతో రహదారులపై వ్యాపారం చేసే చిరు వ్యాపారులు ఉదయం, సాయంత్రం సమయాల్లోనే తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. చాలా వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావట్లేదు. తప్పనిసరి పరిస్థితులు, విధి నిర్వహనలో భాగంగా రోడ్లపైకి వచ్చేవారు గొడుగులు, తలపై వస్త్రాలు చుట్టుకోక తప్పనిస్థితి. ఈ అధిక ఉష్ణోగ్రతల్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ వెంట నీరు, ఇతర శీతల పానీయాలు తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు కోరుతున్నారు.

వెలవెలబోయిన వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత వేసవి ఉష్ణోగ్రతల తీవ్రతతో గురువారం వెలవెలబోయింది. ఎండ తీవ్రతతో ఉదయం 11 గంటలకే కొనుగోలు దారుల రాక తగ్గిపోయింది. సాయంత్రం వరకు ఎండ తీవ్రత తగ్గలేదు. దీంతో కొనుగోలుదారులు రాకపోవడం, వ్యాపారులు కూడా ఎండ వల్ల దుకాణాలు విడిచి రోడ్డు పక్క దుకాణాల చూరుల్లో సేద తీరడంతో సంత బోసిపోయింది. సాయంత్రం తర్వాత ఎండ తీవ్రత తగ్గడంతో క్రమేపీ కొనుగోలు దారుల రాక మొదలైంది. దీంతో సంత జనంతో కళకళలాడింది.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలకు వినతి



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న ఫణీంద్రకుమార్

అనకాపల్లి: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల రూపంలో రూ.లక్షల్లో వసూలు చేయడమే కాకుండా, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను కూడా విక్రయిస్తూ మరింత దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తరగతుల వారీగా నోటీస్ బోర్డులో విద్యార్థుల ఫీజుల వివరాలను ప్రదర్శించి, అంతకంటే ఎక్కువ మొత్తం వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించని సంస్థల గుర్తింపు రద్దు చేయాలని తన వినతి పత్రంలో పేర్కొన్నారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు బి.బాజ్జి, నాయకులు జగదీష్, తాతాజీ ఉన్నారు.